

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు.. కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పాఠం

**"అబ్బ ఉప్మా ఎంత బావుందో!"** తెగ మెచ్చుకుంటూ తింటున్నాడు శ్రీపతి. పక్కనే కూర్చున్న స్నేహ మొహం ముడుచుకుంది.

"వెధవ ఉప్మాదేముందండి. ఎవరు చేసినా ఒకలాగే ఉంటుంది" ఆ ఇల్లాలు మనసులో మురిసిపోతున్న గాంభీర్యాన్ని ఒలకబోస్తూ చెప్పింది.

"భలేవారే. ఇన్నేళ్ళ జీవితంలో ఇంత టేస్టీ ఉప్మా తినలేదంటే నమ్మండి. మా స్నేహ కూడా చేస్తుంది కానీ ఒక్కోసారి వాల్‌పోస్టర్స్ అతికించడానికి పనికొస్తే, ఇంకోసారి బౌల్‌లో పోసుకుని తాగుతాం." గట్టిగా నవ్వాడు.

ఆవిడ 'అయ్యోపాపం!' అన్నట్లుగా శ్రీపతి వంక, కొద్దిగా గర్వంగా స్నేహ వంక చూసి 'ఇంకొంచెం తింటారా?' అని ఆప్యాయంగా అడిగింది.

"ఇంక చాలండీ. అమృతం అయినా మితంగా తింటేనే ఆ రుచి నాలుక మీద ఉండిపోతుంది" ఆ రుచి నాలుక మీద ఉండిపోయింది." ప్లేట్ పక్కన పెట్టి మంచినీళ్ళ గ్లాస్ అందుకున్నాడు శ్రీపతి.

●●●

ఇంటికి వస్తూనే చిరుచుకుపడింది స్నేహ.

"ఏంటీ ఉప్మా అద్భుతంగా ఉందా? ఇంటికి వచ్చినవారికి ఉప్మా పెట్టడమే అసహ్యం అనుకుంటే పైగా మెచ్చుకోళ్ళు. మెచ్చుకుంటే మెచ్చుకున్నారు. మధ్యలో నన్నెందుకు అంటారు?"

"నిజం చెప్పు స్నేహా. మొన్న నువ్వు చేసిన ఉప్మా సూప్‌లాగా లేదు?" అమాయకంగా అడిగాడు శ్రీపతి.

"నిజమే. ఒక్కోసారి కుదరదు. అంత మాత్రాన బయట వాళ్ళ ముందు అలా మాట్లాడచ్చా? ఆవిడకి నా మీద ఇంక విలువేముంటుంది?" దుఃఖంగా అడిగింది స్నేహ.

"నేనేమైనా అబద్ధం చెప్పానా? ఉన్న మాటేగా అన్నాను. నేనిలా నలుగురిలో చెప్పినప్పుడైనా నువ్వు బుద్ధి తెచ్చుకుని ఇంకోసారి కరెక్ట్‌గా చేస్తావని."

"అంటే బుద్ధి లేక సరిగ్గా చేయలేదనా? పొరపాటు జరగదా?"

"ఇంక చాలు ఆపు." అరిచి అక్కడితో ఆ సంభాషణ ఆపేసాడు శ్రీమతి.

●●●

"ఇంకా తయారు కాలేదే? క్విక్ ఫాస్ట్‌గా రెడీ అవు." ఆఫీస్ నుంచి రాగానే హడావిడి చేసాడు శ్రీపతి.

"నేను రావడం లేదు. మీరు వెళ్ళండి." ముభావంగా చెప్పింది స్నేహ.

"ఏం? ఒంట్లో బాలేదా?"

"బానే ఉంది."

"మరి?"

"మీతో నేను ఎక్కడికీ రాదల్చుకోలేదు. అక్కడ ఏదో ఒకటి మెచ్చుకుంటారు. నన్ను వాళ్ళ ముందు చులకనగా మాట్లాడతారు. నాకు నచ్చడం లేదు.. సారీ."

"ఉన్న మాటేగా అంటాను? లేనిది కల్పించి ఎప్పుడైనా చెప్పానా? నువ్వు తెలుసుకుని."

"అదే వద్దు. నాకీ పోలికలు ఇష్టం ఉండవు. నేను రాను. మీరు వెళ్ళండి."

"పాపం. వాడు కొత్త ఇల్లు కట్టుకుని పార్టీ ఇస్తానంటే రానంటావేం? త్వరగా తయారవు. వెళ్దాం" మరో మాటకి ఆస్కారం ఇవ్వలేదు శ్రీపతి.

అయిష్టంగానే బయలుదేరింది స్నేహ.

తన స్నేహితుడి ఇల్లు చూడగానే తెగ సంతోష పడిపోయాడు శ్రీపతి.

"ఎంత బావుంది రా మీ ఇల్లు? ఎంత బాగా సర్దారో. ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నాయ్. మా ఇంట్లో అయితేనా సోఫాలో పేపర్లు, తలుపుల మీద టవల్స్.." చురుగ్గా చూసింది స్నేహ.

"ఇదంతా మా రాధ గొప్పదనమేరా. నేనేం పట్టించుకోను. అంతా తనిష్ట ప్రకారం చేస్తుంది" మురిపెంగా చెప్పాడా స్నేహితుడు.

"రాధగారూ మీరు గొప్ప ఇంటీరియర్ డెకొరేటర్ అండి. మా స్నేహకైతే ఈ ఫ్లవర్ వేజ్ ఇక్కడ పెట్టాలి అన్న ఆలోచన ఎన్ని జన్మలెత్తినా రాదు" ధారాళంగా మెచ్చుకోవడం మొదలు పెట్టాడు శ్రీపతి.

రాధ అప్రయత్నంగా స్నేహవైపు చూసింది. అవమానం, బాధలతో స్నేహ ముఖం ఎర్రబడింది.

"స్నేహా! అక్కడ మన లేడీస్ అంతా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రా వెళ్దాం" స్నేహని తీసుకెళ్ళింది.

"చాలా థాంక్స్ రాధా. ఈయన ఈ మధ్య మరీ భయంకరంగా తయారవుతున్నారు. మిమ్మల్ని మెచ్చుకుంటే నాకేం బాధలేదు. కానీ నన్ను మీతో పోలుస్తూ అవమానంగా మాట్లాడటమే నచ్చటం లేదు" కన్నీళ్ళు పెట్టుకుంది స్నేహ బయటకు వచ్చాక.

"చాలామంది మగవాళ్ళింతే స్నేహా. టేకిట్ ఈజీ." సముదాయించింది రాధ.

●●●

"ఏమిటిలా ఉన్నావు తలనొప్పా?" ముభావంగా ఉన్న భార్యని అడిగాడు శ్రీపతి.

"మీకు తెలీదా?"

"తెలీదు" ... ఓ రాధని మెచ్చుకున్నానని నీకు అసూయ. అంతేకదా?" నవ్వుతూ అడిగాడు శ్రీపతి.

"కాదు. నన్ను పోల్చారని. ఆ సంగతి మీకూ తెలుసు."

"నిజం చెప్పు స్నేహా! వాళ్ళ ఇల్లు ఎంత బావుంది? రాధ ఎంత అందంగా డెకొరేట్ చేసింది. నేనేమీ అబద్ధం చెప్పలేదుగా?"

"నిజమే. ఆ డెకొరేషన్‌కి పది లక్షలైందని చెప్పింది. నాకూ ఇస్తే నేనూ మనింటిని అంతకన్నా ఇంద్రభవనంలా తీర్చిదిద్దుతాను." ఆవేశంగా చెప్పింది స్నేహ.

"నువ్వు ఎన్నయినా చెప్పు స్నేహా! నేను ఎవరినైనా పొగడితే, మెచ్చుకుంటే నువ్వు ఈర్ష్యతో కుమిలిపోతావు" గొప్ప సత్యాన్ని కనుక్కున్నట్లుగా కళ్ళు మలమల లాడిస్తూ చెప్పాడు శ్రీపతి.

ఇక ఈ మనిషితో నాకేంటి మాటలు అన్నట్లుగా స్నేహ మౌనంగా ఉండిపోయింది.

●●●

తర్వాత ఒకటి రెండు ఫంక్షన్స్ వచ్చినా స్నేహ ఏదో వంక చెప్పి తప్పించుకుంది కానీ శ్రీపతితో వెళ్ళలేదు. తప్పించుకోలేని సందర్భాలలో అయిష్టంగా వెళ్ళి, అవమానంతో రావడం అలవాటుగా మారింది.

ఆ రోజు ఆఫీస్ నుంచి ఉత్సాహంగా వచ్చాడు శ్రీపతి.

"స్నేహా! రాజేష్ వాళ్ళింట్లో రేపు సత్యనారాయణ స్వామి వ్రతమట. మరీ మరీ రమ్మని చెప్పాడు. రేపు పదిగంటలకల్లా తయారై ఉండు" చెప్పాడు.

"నేను రానండి. అతని భార్యతో నాకు పెద్దగా పరిచయం లేదు" మెల్లగా చెప్పింది స్నేహ.

"కామన్ ఫంక్షన్స్‌లో నువ్వు తనని చాలాసార్లు చూసావు కదా? చాలా మంచమ్మాయ్. సత్యనారాయణ వ్రతానికి రానని చెపితే దేవుడికి కోపం వస్తుంది. అలా అనకు. నువ్వు వస్తున్నావు. సరేనా?"

అవమానాలు అలవాటైనా మనసు సున్నితత్వాన్ని కోల్పోకపోవడంతో భయపడుతూనే బయలుదేరింది స్నేహ. సాదరంగా ఆహ్వానించింది రాజేష్ భార్య హేమ.

"వ్రతం అప్పుడే అయిపోయిందాండీ?" అడిగింది స్నేహ.

"ఎప్పుడో అయిపోయింది స్నేహా! తెల్లవారు ఝామున నాలుగింటికే లేచి తయారై ఐదింటికల్లా పూజ మొదలుపెట్టాం" చెప్పింది హేమ.

వెంటనే అందుకున్నాడు శ్రీపతి.

"నాలుగింటికి లేచారా? అదే స్నేహయితే పక్కన పిడుగులు పడుతున్నా సరే. ఏడుగంటలకి ముందు లేవదు."

"అందులో ఏముందండీ. ఎవరి అలవాట్లు వారివి. దానికోసం ఇంత మందిలో తనని విమర్శించడం ఏమీ బాగాలేదు" సన్నగా మందలించింది హేమ.

"తనలో ఇంకో దురలవాటు కూడా ఉందండోయ్. ఎవరినైనా మెచ్చుకుంటే సహించలేదు" ఇంకా ఏదో చెప్పబోతున్న శ్రీపతిని ఆపమన్నట్లుగా సైగ చేసి పక్కకి తీసుకెళ్ళాడు రాజేష్.

భోజనాల దగ్గర మళ్ళీ మొదలుపెట్టాడు శ్రీపతి.

"గారెలు ఎంత బాగా చేసారు హేమగారు! అదే మా స్నేహ చేస్తే గోడకి మేకులు కొట్టడానికి వాడచ్చు" ఎంతయినా రాజేష్ అదృష్టవంతుడండీ"

"ఎందుకలా అంటున్నారు? గారెలు ఎవరైనా వండుతారు. అది పెద్ద బ్రహ్మ విద్యేమీకాదు. కానీ స్నేహ ఎంత తియ్యగా పాడుతుందో తెలుసా మీకు? ఎవరో చెప్పినట్లుగా చెవుల్లో అమృతపు చుక్కలు పోసినట్లుంటుంది. తను టెన్నిస్ కూడా చాలా బాగా ఆడుతుందిట. కాలేజ్ ఛాంపియన్ అని వాళ్ళ కాలేజ్‌లో చదివిన ఇంకో ఫ్రెండ్ చెప్పింది. మీరు ఈ మంచి లక్షణాలని ఎప్పుడైన పొగిడారా? స్నేహలోని అందం, ముఖంలోని ఆ కళ ఎప్పుడైనా గమనించారా?" కటువుగా అడిగింది హేమ.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు శ్రీపతికి. ఇంటికి వచ్చాక స్నేహకూడా ఎప్పట్లా అతన్ని నిలదీయలేదు. 'చేరి మూర్ఖుని మనసు రంజింపచేయలేం' అని ఊరుకుంది.

●●●

సోమవారం మధ్యాహ్నం హేమనుంచి స్నేహకి ఫోన్ వచ్చింది.

"ఇతరుల ముందు మీవారు మిమ్మల్ని అలా చులకనగా మాట్లాడుతూంటే ఎలా భరిస్తున్నావు స్నేహా?" చనువుగా అడిగింది.

స్నేహ కళ్ళు జలపాతాలయ్యాయి.

"పెళ్ళయిన కొత్తల్లో పర్వాలేదు హేమగారు! ఇంటికి వచ్చాక పోల్చి తిట్టేవారు. ఇప్పుడు సమయం, సందర్భం, ప్రదేశం ఏదీ చూసుకోవడంలేదు. నోటికి వచ్చినట్లు మాట్లాడేస్తున్నారు. నిజంగా నరకంలా ఉంది. తనని చిన్నమాట అంటే నానా రాద్ధాంతాం చేస్తారు. మరి నాకెలా ఉంటుందో తెలీదంటారా? ఏం చేయాలో అర్థంకావడంలేదు" వెక్కిళ్ళ మధ్య చెప్పింది.

"దేనికైనా ఒక ముగింపు లేదా ఫుల్‌స్టాప్ ఉండాలి స్నేహా. అతన్ని కంట్రోల్ చేయగలవాళ్ళెవరైనా ఉన్నారా? పోనీ మీ అత్తగారు లేదా మామగారు చెపితే వింటారా?"

"లేదండీ. వాళ్ళు మేము పంపే డబ్బుతోనే బ్రతుకుతున్నారు. అందుకని ఈయనకి కోపం తెప్పించడం వాళ్ళకి ఇష్టం ఉండదు. పైగా నేను వాళ్ళకి కోడలిని కదా? సానుభూతి ఉంటుందనుకోను."

"సారీ స్నేహా నేను రాజేష్‌కి మీవారికి నచ్చచెప్పమని చెప్తా. చూద్దాం."

"ఆ మనిషి మారరు హేమగారు. నా ఖర్మ ఇంతే." ఫోన్ పెట్టేసింది స్నేహ.

●●●

"మా ఫ్రెండ్ కూతురు ఫస్ట్ బర్త్‌డే రేపు సాయంత్రం. నేను వచ్చేసరికి రెడీగా ఉండు" ఆర్డర్ జారీ చేసాడు శ్రీపతి.

సరే అన్నట్లుగా తలాడించింది స్నేహ.

ఆ స్నేహితుడు హోటల్లో ఇస్తున్న ఆ బర్తడే పార్టీలో స్నేహకి తెలిసినవాళ్ళు చాలామంది కనిపించారు. వీళ్ళందరి ముందు తన తన పరువు తీయబోతున్నాడేమో అని కాళ్ళు వణికాయి స్నేహకి.

బర్తడే బేబీ ముద్దుగా ఉంది. అందంగా తయారైంది. శ్రీపతి మొదలుపెట్టాడు.

"మీ పాప ఎంత బావుందండీ. ఎంత బాగా తయారు చేసారు. అదే మా స్నేహయితే.." ఆగిపోయాడు.

వెంటనే అందుకుంది స్నేహ.

"నేనైతే ఇంత బాగా తయారు చేయలేనేమో ఎందుకంటే నాకు పిల్లలు లేరుగా?. నాకు ఉప్మా వండటం, గారెలు చేయడం, ఇల్లు అందంగా అలకరించడం, తెల్లవారు ఝామున లేవకపోవడం ఇలాంటి అవలక్షణాలు ఉన్నా, పిల్లల్ని కనే సమర్థత మాత్రం ఉందండీ. కానీ ఏం లాభం. నాతో అనేక లోపలని ఎంచే మావారిలోనే ఉందా అసమర్థత."

ఆ చుట్టుపక్కల ఉన్నవారంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయి శ్రీపతి వంక చూసారు. అవమాన భారంతో కృంగిపోయిన శ్రీపతిని చూస్తూ కసిగా అడిగింది స్నేహ.

"నిజం చెప్పండి. నేను అబద్ధం చెప్పలేదుకదా? మీలో పిల్లల్ని కనే సామర్థ్యం లేదని డాక్టరుగారు చెప్పారు కదా? ఇలా నలుగురిలో చెపితే అయినా మీరు మీ సామర్థ్యాన్ని పెంచుకుంటారేమోనని చెప్పా అంతేకానీ ఇలా ఉక్రోషపడతారని కాదు."

విజయగర్వంతో ఠీవిగా బయటికి నడిచింది స్నేహ.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story